# కోతి - భీతి

రోడ్డు వార కుక్కి మంచంలో కూచున్నాడు ఖుద్దూస్. ఏదో దీర్ఘమయిన ఆలోచనలో మునిగి వున్నాడల్లే వుంది. అతని దృష్టి రోడ్డుమీద లేదు. అప్పుడే రోడ్డుమీది దుమ్మునీ ధూళినీ ఒక్కసారి ఆకాశం అంత ఎత్తున లేపి వెళ్ళిన కట్టెల లారీ మీద గాని, ఆ దుమ్ములో, దోసిళ్లతో మట్టి దూసుతూ కేరింతలాడే మూడేళ్ళ, అతని కూతురు హమీదాని గాని, అతడు గమనించలేదు.

అతనెటో దీనంగా, శూన్యంలోకి చూస్తున్నాడు... అతడి బావమరిది రోడ్డు మీదనే, కోతులబోను కట్టడానికి సరంజామా అంతా పడేసుకుని, బీడీ దమ్ము గట్టిగాలాగి, పచ్చి వెదురు బొంగులను చీల్చడం మొదలు పెట్టేడు.

ఖుద్దూస్ ఒక్కడే గాదు, యింకా ఆ రోడ్డు మీదనే, మరో పాతిక గుడి సెలన్నావున్నాయి - ఈ గుడి సెలవాళ్లకి మూడొంతుల జీవితం రోడ్డు మీదనే గడిచిపోతుంది. నిర్మొహమాటంగా, నిశ్చింతగా రోడ్డుని వాడుకుంటారు వాళ్లు. లారీలే అవనీండి, సైకిళ్లే అవనీండి - అక్కడి రోడ్డుమీది మూడేళ్ల కూన కూడా లక్ష్యపెట్టదు; అవే తప్పించుకుని వెళ్లాలి.

ఖుద్దూస్ ఆలోచన పాలుపోని వాడిలా, బావమరిది సయ్యద్‌ని వుద్దేశించి - "వో బీడీ" ముక్కని యివ్వమనడిగేడు.

"ఏమిరా భాయ్? ఎన్నడూ లేంది యివాళ నన్ను బీడీ యివ్వమన్నావ్. బేరం ఏం పడలేదా? అసలు కోతులే చిక్కలేదా?" అన్నాడు సయ్యద్.

"అసలు కోతులని పట్టడమే మానేస్తాను రా," ఖుద్దూస్ బలవంతంగా చెప్పేడు తన వుద్దేశ్యాన్ని.

నిజానికి ఆమాట మీద తనకే నమ్మకం లేదు." భాయ్! రిక్షా తొక్కడం నేర్చుకుంటా. లేకపోతే, ఆ బోనులు చెయ్యడం నేర్పు. అదేనా చేస్తాను." ఖుద్దూస్, సయ్యద్ విసిరేసిన బీడీనంటించి, ఒక్క దమ్ములాగి, బ్రతిమిలాడుతున్నట్లు అడిగేడు.

"ఒరే! పిరికి నాయాళా, పడ్డాయా ఓ పాతిక్కోతులు పడతాయ్! రెండో, మూడో పనికి వచ్చేయో,

పదిరోజులు జల్సాగా గడుస్తాయి. దాన్ని వొదిలిపెట్టి, మాయదారి రిక్షా అంటావేమిటి?" సయ్యద్ చప్పరించాడు.

ఖుద్దూస్‌కి కూడా యిష్టంలేదు. కాని, ఎంచేతనో భయంగా వుంది అతనికి. ఖుద్దూస్ కంచించెర్ల, కొండపల్లి లాంటి చిక్కని అడవుల్లో అక్కడి వాళ్లతో చేరి, దిట్టమయిన కోతులను ఎన్నోపట్టడం, అవలీలగా బోనుల్లోకి తోసి పట్నానికి తేవడం నేర్చుకున్నాడు. మొదట్లో దారుణమయిన "మకిరి కంపుకి" కడుపుతిప్పేది. కోతుల అల్లరికి ప్రాణం విసిగిపోయేది!

ఎక్కువగా ఖుద్దూస్ తోటి వాళ్లంతా మహమ్మదీయులే. అందులో చాలా బాగం పల్లెటూరి మూక. అంచేతనే - వాళ్ళమీద ఖుద్దూస్ అజ్మాయిషీ చెలాయించేవాడు.

వాళ్లల్లో చాలా మంది కొంచెమైనా తురక భాషరాని వాళ్లు. తెలుగు గ్రామీణం మాట్లాడుకుంటారు. ఖుద్దూస్ తెలుగుయాసకి - వాళ్ళు "పట్నంబాస" అని పేరు పెట్టేరు. ఖుద్దూస్ కోతులను పట్టడం ప్రారంభించిన దగ్గర్నించి సంసారం చక్కగా గడిచిపోతున్నది.

ఉచ్చుపన్ని, వేరుశనక్కాయలు, శనగలూ పోసి, చెట్టెక్కి.. మజాగా బీడీతాగుతూ-సినిమాలు, బ్రాకెట్లు తల్చుకుంటూ వుంటే వేరే స్వర్గం వుందా? అనిపించేది.

బిలబిలామని కోతులు పడడంతోనే వుచ్చులు లాగి, చెట్లు దూకి, "కీకా", "కిచకిచ"మని ఏడ్చేవాటిని పట్టుకొని బోనుల్లోకి తోసి పట్టుకొచ్చేవాడు ఖుద్దూస్.

కోతులన్నింటినీ ఏజెంటు కొనడు. అసలు కోతులన్నీ పనికిరావని తోసివేసిన సందర్భాలు కూడా అనేకం వుంటాయి. పిల్లలు వున్న కోతులూ, కాన్పులు ఎక్కువైన కోతులూ, వయస్సు మీరిన కోతులూ - అని తీసి వేరే పెట్టేసి - సరిగ్గా అయిదు పౌన్లో, ఆరు పౌన్లో బరువు వున్న మాంచి ఆరోగ్య వంతమైన రెండు మూడు కోతుల్ని కొంటే అదృష్టమేనన్నమాట.

మిగిలిన కోతుల్ని రోడ్లమీద, పట్టణంలో వదిలేయడం, అవి యిళ్ళ వెంటా, గుళ్లవెంటా పడ్డం - జనానికీ, కోతులకీ కూడా అలవాటయిపోయింది.

కాని, ఖుద్దూస్‌కి కోతుల మకిరి కంపుకి కడుపులో తిప్పి గాని, వాటి ఏడుపు అర్ధమయిగానీ - మానేయ బుద్ధి వేయలేదు. భయం... భయం-చేత మానేద్దామనుకున్నాడు!

ఖుద్దూస్ - ముసిరే చీకట్లలో అలాగ ఆలోచనలో పడి కొట్టుకుంటూనే వున్నాడు. రోడ్డు మీంచి అవతలి సందుమొగని గోలవినిపించి, అటుకేసి చూసేడు. ఒక యింటి మీద, ఒక పిల్లని కడుపుకి కరుకుచుని వున్న ఎర్రపిర్ర పెద్దకోతినొక దాన్ని కుర్రాళ్లు రాళ్లతో కొట్టి, వెక్కిరించి, యాతన పెడుతున్నారు. పాపం! ఆ మర్కటం, యీ యింటిమీంచి ఆ యింటి మీదికి, అటూ యిటూ గెంతుతూ, ఆత్మరక్షణకీ, పిల్లని రక్షించు కుందికీ తంటాలుపడుతోంది!

కుర్రాళ్లు విసిరిన రాళ్లు కొన్ని యిళ్లల్లో పడ్డాయి కాబోలు - యింట్లోంచి కొందరు మనుషులు

వచ్చి - కుర్రాళ్లను గదమాయించడం మొదలెట్టారు.

ఖుద్దూస్ గబిక్కున, ఉగ్రుడై లేచాడు. ఆ కుర్ర వెదవల్లో తన కొడుకు కాశిమ్ కూడా వున్నాడు. వాడు విసిరిన రాయి తిన్నగా వెళ్లి కోతి పిర్రకి తగిలింది. అసలే ఎర్రని పిర్రలేమో, చీలి మరింత నెత్తురు కారి, అరుణారుణమై పోయింది దాని పిర్ర.

"ఒయ్! ఎద్వసచ్చినోడా!" తెలుగులోనే కేకేసేడు. వెళ్లి, కొడుకుని గొరగొరా లాక్కొచ్చి, గుడిసెలో పారేసేడు.

ఖుద్దూస్‌కి పిల్లలంటే మమకారం. అందుకే, కోతులు పట్టే వృత్తి వదిలేద్దామని ఆలోచిస్తున్నాడు.

ఈ కోతుల్ని, ఎవరోగాని, హిందువులు ఎక్కువగా పట్టరు. వాళ్లసలు ఈ కోతుల వేటకే చాలా విముఖత చూపిస్తారు. కారణం, ఆంజనేయుడు వాళ్ల దేవుడవడం ఒకటి. రెండవది పాపభీతి. ఈ కోతులన్నిటినీ, యింత రొక్కంతో కొన్నాక, బొంబాయికి పంపి, అక్కడ చంపుతారనీ - వాటి మెదడు, గుండెకాయ మాత్రం సముద్రాల మీద, విదేశాలకి వెడతాయనీ - అలగా జనం అందరికీ నమ్మకం.

అదీగాక, ఖుద్దూస్ కళల ఎదుటే - ఎరుకల పెంటయ్య పిచ్చెత్తిపోడం చూసేడు.

ఎరుకల పెంటయ్య, ఎంత చెప్పినా వినక వందల కొద్దీ కోతుల్ని పట్టడం, అమ్మిన కాడికి అమ్మడం, తతిమ్మా చెల్లని వాటిని, వినోదంగా చంపడం, కొట్టడం చేసేవాడు. కొన్నింటిని, తోకలు కత్తిరించి అడవిలో తిరిగి వదిలీడం - చేసేవాడు. మూతికి నల్లరంగు పూసి మరీ వదిలేసేవాడు.

సంపాయించిందంతా బ్రాకెట్లు కట్టీ, సినిమాలకీ, జూదాలకీ తగలెట్టేవాడు.

ఉండుండి, ఒకనాడు - పెంటయ్యకి పిచ్చెక్కింది. వొంటి మీద బట్ట కట్టడు. మనుషుల్ని గుర్తు పట్టడు. చెట్లూ, చేమలూ విరిచి, తోక ఒకటి పేని, నడుంకి కట్టుకొని తిరుగుతాడు.

"ఊరికినేపోతాదేంటి? చేసిన పాపం," అన్నారు కొందరు "చెబితే యినడు. ఎదవనాయాళ. ఆంజనేయులు వోరికి కోపం వచ్చినాది," అని మరికొందరు యీసడించారు. మొత్తానికి, పెంటయ్యకి - కోతులకు పట్టిన గతే పట్టింది. ఊళ్లోనించి అడవిలోకి, అడవిలోనుంచి కొండమీదికి - యిలా తరమడమే పనిగా చేసేరు అందరూ వాడిని. వాడి పెళ్లాం మారుమనువు వెళ్లిపోయింది.

ఖుద్దూస్‌లో యిది అంతగా చలనం తీసుకురాలేక పోయింది" వాడు హిందువు. భజ్‌రంగ్‌బలి అడికి శిచ్చ హేసేడ్,"అని సముదాయించుకున్నాడు. కాని ఛోటా భాషా అనే తన దూరం బంధవు ఒకడు హఠాత్తుగా ప్రాణం వదిలేశాడు. అది ఖుద్దూస్‌ని బాగా కదిలించింది.

హాయిగా తిని తిరుగతూ, కోతులవేటలో పేరుమోసిన వాడల్లా, ఒకనాడు యింటికి వచ్చి, రోడ్డుమీదికి నులకమంచం లాక్కొని వేసుకొని, భార్యని పిలిచేడు. ఘోషా, భాషా రెండూ కూడా అంతగా తెలియని అతని పెళ్ళాం - యివతలికి వచ్చి రోడ్డు మీద కూర్చుంది.

"జటకా ఏసుకుంటా" నన్నాడు ఛోటూ. అయ్యో, భగవంతుడా! రిచ్చాల ప్రపంచంలో జటకాలు హేమిటీ?" అని యిరుగు ఈరాసామికీ, దూరంగా వున్న బండి వెంకయ్యకీ వినిపించేలా అందుకుంది బీబీ. నలుగురూ చేరారు. వింతగా చూశారు. పెళ్లాం - " కోతుల యాపారం మానీ వద్దనీ' భర్త - "మానేస్తా ననీ" వాదులాడుకున్నారు. చివరికి ఛోటూ వీగిపోయి, "తెల్లారగట్ల లేపెహె-యడ్వికి వెళ్తానని," పడుక్కున్నాడు. అంతే, తెల్లారగట్ల మరిలేవలేదంతే!

ఖుద్దూస్ ఒకడికే కాదు. ఇంకా మరి కొంతమందికి యీ భీతి పట్టుకుంది. నీతికి నిర్వచనం గానీ, అర్థంగాని తెలీని వాళ్లే వాళ్లందరూ.

కోతిమీదగాని, కొంగమీద గానీ - జాలి అంటే ఏమిటో? జాలి ఎలా పడాలో తెలీని వాళ్లే వీళ్లంతా! అయినా 'పాపం' అంటే భయం వేసింది. అదీగాక, ప్రతీకారం, వాటి ఉసురు తీసిన ఫలితం స్పష్టంగా కనిపిస్తున్నదేనని కలవరపడ్డాడు ఖుద్దూస్.

కోతులు పట్టే కుటుంబంలో, ఎవరికే ఆపద కలిగినా కోతుల వుసురేనని భయం వేసింది!

సలాం భాషా కూతురు, వాడిని దుఃఖసాగరంలో ముంచి తరలిపోయింది. పదేళ్ళ పాప చావుతో వాడు మంచం పట్టాడు. ఎన్నో కుటుంబాలు చీలిపోయేయి - అనుకోని కక్షలు, కావేషీలు పెరిగేయి. ఇవన్నీ 'కోతుల వుసురే' ననుకున్నాడు ఖుద్దూస్.

ఒకవైపు యివి జరగడం, మరోవైపు కొత్తవాళ్లు కొందరు సాహసించి ఆర్‌హెచ్ రక్తం గల కోతుల వేటకి పూనుకోడం జరుగుతూనే వుంది. అయినా గిరాకీ పెరిగి, పాతవాళ్లలో కొందరు మరింత పుంజుకోడం మొదలెట్టారు.

ఖుద్దూస్ ఎంతప్రయత్నించినా యిక కోతుల్నిపట్టలేననుకున్నాడు. హమీదాని రోడ్డుమీద నుంచి గొరగొరలాక్కొచ్చింది అతని భార్య. ఖుద్దూస్ అనాలోచితంగా కూతుర్ని కౌగిట చేర్చుకున్నాడు. కడుపు నిమిరేడు. చెయ్యి చుర్రుమని మండింది.

"బుఖార్" - ఖుద్దూస్ గుండెల్లో రాయిపడ్డది. లేచి, పిల్లని పక్కకి నెట్టి కూచున్నాడు. పిల్ల మంచం పట్టి మీద వాలి నిద్దరోయింది.

-"జొరం మండి పోతోంది"

ఖుద్దూస్ లేచి వెళ్లిపోయేడు అక్కణ్ణించి. తోవలో చాలా మంది - తన గ్యాంగు కనిపించారు. "ఒరేయ్! గిరాకీ పెరిగిందిరా. ఏజంటు యివాళ పల్లెటూరి నాయాళ్లనందర్నీ యెనక్కి తిప్పేసేడు గాని... గోలెడుతున్నాడు... కోతి కాడికి రెండు రూపాయలు పెంచుతాడంట!" అన్నాడు.

"హెద్వది... పోనియ్! నా బిడ్డకి బుఖారొచ్చిందిరా," అని ఖుద్దూస్ పాత జట్కాల స్టాండూ, కొత్త రిక్షాల స్టాండూ అయిన ప్రదేశానికి చేరుకున్నాడు. అష్టా చెమ్మా ఆట దగ్గిర చేరేడు. అక్కడ వీళ్లందరికీ వడ్డీలకి అప్పుపెట్టే మోతుబరి దగ్గర నాలుగు రూపాయలుపుచ్చుకున్నాడు. బేడబేడ వడ్డీ. గడువు

మూడు రోజులు మాత్రం...

×××

ఖుద్దూస్ మరి మూడు రోజులుయిల్లు చేరలేదు. వాడి పెళ్లాం గోల పెట్టేసింది. వెతికించీ, వెతికీ - విసిగిపోయింది.

'అయ్యో! ఏ అడవిలో, ఏ పోట్లాటలో, ఏ సచ్చినాడు పొడిసేశాడో" అని ఏడుపు మొదలెట్టింది.

మూడ్రోజుల నాటి వుదయం డొక్కల్లో కాళ్లు ముడుచుకుని, హమీదాని కడుపుమీద వేసుకొని నిద్దరోతున్న ఖుద్దూస్ పెళ్లాం - తన యింటి గుమ్మంలో రిక్షామువ్వల చప్పుడుకి వులిక్కిపడిలేచింది.

ఆశ్చర్యంగా చూస్తూ యివతలికి, యీదురోమంటూ, రెండు చేతులా బుఱ్ఱగోక్కుంటూ వచ్చింది. ఖుద్దూస్ రిక్షామీద కూర్చుని వున్నాడు. విజయగర్వం వాడి కళ్లల్లో మెరిసిపోతోంది!

బీబీ నోరెళ్లబెట్టి చూడ్డం మొదలెట్టింది. వాడు బీడీ ముక్క తీసి ముట్టించేడు. "రిచ్చాహెవడ్దీ?' '- అడిగింది. "మన్దేనే! అద్దెది", ఖుద్దూస్ గుడిసెలో దూరి, హమీదాని, కాశిమ్‌ని ముద్దెట్టుకున్నాడు. తృప్తిగా వాళ్లిద్దర్నీ తడిమిచూసుకున్నాడు.

"మరి పోలీసోడు పట్టుకోడా?" భయంగా చూస్తో... లోపలికి వచ్చింది భార్య.

'లైసెన్సుయిద్గో... అదీ అద్దెకి దొరకదేటీ... తర్వాత "సంగానికెడతాలే, ఒక నెల్లాళ్లయ్యాక" - ఖుద్దూస్ ధైర్యంగా జవాబిచ్చాడు యూనియన్ కాపాడుతుందన్న ధైర్యం అది.

ఖుద్దూస్ వాడి పిల్లలికి జీవిత భీమా చేసినంత సంతోషం పడి వుంటాడు. అతని మనసు నిండుగా వుంది. పాపభీతి తొలగిపోయింది....

**(1960, సైనిక్ సమాచార్)**